ప్రజలను బాదడమే బాబు నైజం

- కులాలు, మతాలకు అతీతంగా బాదేస్తున్నారు
- ప్రజలను ఆర్థికంగా నడ్డి విరుస్తున్నారు
- ప్రజా వ్యతిరేకపాలనను



విద్యుత్ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కేపీ నాగార్జునరెడ్డి, నాయకులు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రజలపై వివిధ రూపాల్లో భారం మోపి బాదేయడమే సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విమర్శించారు. కులమతాలకు అతీతంగా కూటమి ప్రభుత్వం ఏ ఒక్కరినీ వదలకుండా సమానంగా బాదుతోందని ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేక పాలనపై వైఎస్ జగన్ నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో నిరసనలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమాన్ని గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కె.పి.నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత గిద్దలూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకుని ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ఏఈ నర్రాల నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత సామాన్య ప్రజల నడ్డివిరిచేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఆరు నెలల వ్యవధిలో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తొలగించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. విద్యుత్ చార్జీలను ప్రతి నెలా పెంచుకుంటుపోతారట.. ఇదెక్కడి ప్రభుత్వమని ప్రజలంతా నివ్వెరపోతున్నారన్నారు. కరెంటు వాడాలంటే భయపడే పరిస్థితిని తీసుకొచ్చి నిస్సిగ్గుగా పరిపాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. పెంచిన చార్జీలను తగ్గించే వరకు ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. రైతులకు చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఇటీవల రైతుపోరు కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. జనవరి 3న విద్యార్థుల సమస్యలపై పోరాటం చేయనున్నట్లు పేర్కొన్నారు.

హామీలు అమలు చేయాలి

కూటమి ప్రభుత్వం సర్‌చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం దారుణమని, వెంటనే చార్జీలను ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తొలగించి బిల్లులు కట్టించుకోవడాన్ని తప్పుబట్టారు. గతంలో అర్జీ దాఖలు చేసుకుంటే చాలు అన్ని సేవలను అందించేవారు ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో పెట్టడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జగనన్న పిలుపు మేరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ సిద్ధమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిద్దలూరు మాజీ ఎంపీపీలు కడప వంశీధరరెడ్డి, పి.శ్రీనివాసులుయాదవ్, అర్ధవీడు మాజీ ఎంపీపీ రవికుమార్, కొమరోలు జెడ్పీటీసీ వెంకటనాయుడు, బేస్తవారిపేట ఎంపీపీ ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ వెంకటరాజు, నాయకులు డాక్టర్ భూమా నరసింహారెడ్డి, పులి రామకృష్ణారెడ్డి, ఓబులరావు, పాలుగుళ్ల నరసింహారెడ్డి, స్వామిరంగారెడ్డి, ముడియం వెంకటరెడ్డి, కంభం మండల నాయకులు గొంగటి చెన్నారెడ్డి, నెమలిదిన్నె చెన్నారెడ్డి చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, శివారెడ్డి, రాచర్ల మండల నాయకులు సీఆర్‌ఐ మురళి, పగడాల రంగస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాల్సిందే

- విద్యుత్ బిల్లులు తగ్గిస్తామని చెప్పి సర్‌చార్జీ పేరుతో ఈ బాదుడేంటి?
- ఎస్సీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఆపేయడం దారుణం
- వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు
- విద్యుత్ ఈఈ కార్యాలయం ఎదుట ప్రజలతో కలిసి ధర్నా
- ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, పార్టీ శ్రేణులు



విద్యుత్ ఈఈకి వినతిపత్రం ఇస్తున్న అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి, నాయకులు

మార్కాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, ప్రజలపై అదనపు భారాన్ని తొలగించాలని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు డిమాండ్ చేశారు. కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మార్కాపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా స్థానిక తర్లుపాడు రోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి ఈఈ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. తాను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచనని, వీలైతే తగ్గిస్తానని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే గృహ వినియోగదారులపై 15,485.36 కోట్ల రూపాయల భారం మోపడం అన్యాయమని, సర్‌చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోగా ప్రజలపై భారం వేయడం సరికాదన్నారు. ఇప్పుడు కరెంటు చార్జీలు, వచ్చే నెలలో రిజిస్ట్రేషన్ చార్జీలు.. ఇలా ప్రతిదీ పెంచుకుంటూ పోతే ప్రజలేం కావాలని ప్రశ్నించారు. సంపద సృష్టిస్తామని చెప్పి ప్రజలపై మోయలేని భారం వేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని, చార్జీలు తగ్గించేంత వరకు ఉద్యమిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ.. పెంచిన విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోకుంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, పార్టీ నేతలు కేవీ రమణారెడ్డి, ఎస్.శ్రీనివాసరెడ్డి, మేడా బద్రి, పీఎల్‌పీ యాదవ్, కౌన్సిలర్లు షెక్షావలి, సలీం, కరిముల్లా, ఎం.శ్రీనివాసులు, కొత్త కృష్ణా, హర్షిత, కాటమయ్య, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, జీ.చెన్నారెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, లయోల చెంచిరెడ్డి, కుందురు వెంకటరెడ్డి, వరప్రసాద్, నాగసుధీర్, వార్డు ఇన్‌చార్జిలు రంగయ్య, ఉత్తమ్‌కుమార్, బూదాల గురవయ్య, నల్లబోతుల కొండయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర, పంబి వెంకటరెడ్డి, గౌస్ మొహిద్దీన్, తుమ్మా వెంకటరెడ్డి, వెల్పుల చెన్నారెడ్డి, నాళి రజని, చదలవాడ రమణారెడ్డి, నాలి కొండయ్య, వేములకోట నాయకులు జంకె వెంకట నారాయణరెడ్డి చాగంటి వెంకటనారాయణరెడ్డి, తర్లుపాడు ఎంపీపీ భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి, సర్పంచ్ దూదేకుల మస్తాన్, అక్బర్‌అలీ, దాసయ్య, యక్కంటి రామిరెడ్డి, రమేష్‌రెడ్డి, రమణయ్య, కొనకనమిట్ల ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ శంకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రంగారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి, పంబి వెంకటరెడ్డి, రఫీ, బొగ్గరపు శేషయ్య, పత్తి కృష్ణా, కాళ్ల ఆది, బోడపాడు సర్పంచ్ రమణారెడ్డి, దాస్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రంగారెడ్డికి మాజీ ఎమ్మెల్యే కేపీ పరామర్శ



డాక్టర్ రంగారెడ్డితో మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ సీహెచ్ రంగారెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ గిద్దలూరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శుక్రవారం గిద్దలూరులో డాక్టర్ రంగారెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ భూమా నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

పంట నష్టపరిహారం అందేలా చూస్తాం

- ఏడీఏ బాలాజీ నాయక్

మార్కాపురం: మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని మార్కాపురం, తర్లుపాడు, కంభం మండలాల్లో గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నామని మార్కాపురం వ్యవసాయ శాఖ ఏడీ బాలాజీ నాయక్ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వానికి నివేదిక అందజేసి నిధులు రాగానే రైతులకు అందిస్తామని చెప్పారు. వర్షంతో పంట నష్టం సంభవించడంపై 'ఈ వాన ఎన్నాళ్లు.. మిగిలేది కన్నీళ్లు!' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఏడీఏ స్పందించారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి నష్ట పరిహారం రావాల్సిన రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపుతామన్నారు.

2300 ఎకరాల్లో శనగ పంటకు నష్టం

కంభం: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను గురువారం వ్యవసాయాధికారిణి డి.స్వరూప పరిశీలించారు. శనగ, మినుము పంటల్లో ఎక్కువగా పూతరాలి నష్టం వాటిల్లిందని ఏఓ పేర్కొన్నారు. నేలలో తేమ శాతం పెరగడం వలన పూతరావడం ఆలస్యమవుతుందన్నారు. మండలంలో ఇప్పటి వరకు 2,300 ఎకరాల్లో శనగ పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. రావిపాడు గ్రామంలో మినుము, శనగ పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతులు వాపోయారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు.

పాముకాటుతో రైతు మృతి

మార్కాపురం రూరల్: పాముకాటుతో రైతు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం మార్కాపురం మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుంజే చెన్నయ్య పొలంలో సొరకాయ కోసుకునేందుకు వెళ్లగా అక్కడే ఉన్న కట్లపాము కాటు వేసింది. స్థానికులు స్పందించి హుటాహుటిన మార్కాపురం జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు జంకె వెంకటనారాయణరెడ్డి, గురవయ్య తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం



సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కొనకనమిట్ల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రభుత్వాలపై పోరాటం చేస్తున్నామని సీపీఐ మండల కార్యదర్శి కొక్కెరమిట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు అయిన సందర్భంగా కొనకనమిట్ల సెంటర్లో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల సమస్యలు, ప్రభుత్వాలు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సిద్దయ్య, పిచ్చయ్య, నాగరాజు, మాలకొండయ్య, శ్రీను, రైతు సంఘం నాయకులు శిగినం వెంకటేశ్వర్లు, పి.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మోహిద్దీన్‌పురం సమీపంలో చిరుత సంచారం!



పాదముద్రల కోసం పరిశీలిస్తున్న అటవీ అధికారులు

అర్ధవీడు: మండలంలోని మోహిద్దీన్‌పురం గ్రామంలో చిరుతపులి సంచరిస్తోందన్న ప్రచారంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం రాత్రి కారులో ఆ మార్గంలో వెళ్తున్న ముగ్గురు వ్యక్తులకు చిరుతపులి రోడ్డు దాటుతూ కనిపించిందని గొర్రెల కాపరులకు చెప్పినట్లు తెలిసింది. ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. నాగులవరం రోడ్డులో పరిశీలించగా చిరుత పాదముద్రలేవీ లభించలేదన్నారు. అయినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి



మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న కిట్స్ కళాశాల సిబ్బంది

మార్కాపురం: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి శుక్రవారం స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సిబ్బంది సంతాపం తెలియజేశారు. మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల సెక్రటరీ అన్నా కృష్ణచైతన్య మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి మన్మోహన్ సింగ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏవో ప్రభాకర్, హెచ్‌ఓడీలు రామమోహన్, అనిల్ కుమార్, రాముడు, ప్రసన్న మురళి, అమృతవల్లి, రమణారెడ్డి, మనోహర్, పీడీలు రంగస్వామి, అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు మాజీ ఎమ్మెల్యే కేపీ సంతాపం

మార్కాపురం: దేశ ఆర్థికాభివృద్ధికి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి కొనియాడారు. మన్మోహన్ సింగ్ మృతి బాధాకరమని పేర్కొంటూ సంతాపం తెలియజేశారు. భారతదేశ ఆర్థిక మంత్రిగా, ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన అందించన సేవలు ఎనలేనివన్నారు.

ఈ-పంట నమోదుతో ప్రయోజనం

గిద్దలూరు రూరల్: రైతులు సాగు చేసిన పంటల వివరాలు ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏఓ విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కేఎస్.పల్లె గ్రామంలో రైతులకు పంటల నమోదుతో కలిగే ప్రయోజనాన్ని వివరించారు. ఈ సీజనలో శనగ, మినుము, వరి, జొన్న, మొక్కజొన్న, ఎండుమిరప పంటలకు బీమా వర్తిస్తుందన్నారు. పంట బీమా చేయించుకునేవారు ఆధార్ కార్డు, పట్టాదారుపాసుపుస్తకం, పంట ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీతో దగ్గరలోని మీసేవ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. కంది, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సంచాలకులు రవి, వెటనరి అసిస్టెంట్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

'నావల్ల కాదు.. నేనెళ్లిపోతున్నా'

– రెవెన్యూ సదస్సు నుంచి వెళ్లిపోయిన తహసీల్దార్



తహసీల్దార్ ఎదుట బైఠాయించిన బాధితులు

తర్లుపాడు: గ్రామ స్థాయిలో భూముల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు నుంచి తహసీల్దార్ విజయ భాస్కర్ అర్ధంతరంగా వెళ్లిపోవడం తీవ్ర చర్చనీయంశమైంది. మండలంలోని కారుమానుపల్లిలో నిర్వహించిన సదస్సులో శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. తర్లుపాడుకు చెందిన బాధితురాలు మహభూబి సర్వే నం.77-9లోని తన రెండు ఎకరాల భూమిని ఇతరుల పేరున అధికారులు ఆనులైన్ చేశారని, న్యాయం చేయాలంటూ తహసీల్దార్ ఎదుట భైఠాయించారు. దీనికి తోడు సమస్యలు పరిష్కరించలేని సదస్సు ఎందుకంటూ రైతులు ఒక్కసారిగా నిలదీశారు. దీంతో ఒక్కసారిగా ఆవేశానికి గురైన తహసీల్దార్ 'నా వల్ల కాదు.. నేను సెలవుపై వెళ్లిపోతున్నా' అంటూ రెవెన్యూ సదస్సు నుంచి వెళ్లిపోయారు. తర్లుపాడుకు చెందిన ఓ వ్యక్తిపై పలు గ్రామాల్లో భారీగా ఫిర్యాదులు రావడం, బాధితులు నిలదీయడం, పనులు చేయాలంటూ రాజకీయంగా ఒత్తిడి ఎక్కువ కావడంతో తహసీల్దార్ ఆవేదనకు గురైనట్లు కింది స్థాయి సిబ్బంది చర్చించుకుంటున్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారి మధు ప్రియాంక

అర్ధవీడు: అడవులకు నిప్పంటించడం వల్ల జీవరాశులకు అనర్థమని ఫారెస్ట్ అధికారి మధు ప్రియాంక పేర్కొన్నారు. అడవికి నిప్పు మనుగడకు ముప్పు అంశంపై బుర్రకథ కళాకారులతో మండలంలోని అంకభూపాలెంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అడవులను సంరక్షించుకుంటేనే సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండుతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి మాల్యాద్రి, బీట్ ఆఫీసర్ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.